‘ఆదర్శం’.. విద్యార్థుల భవితకు ఆహ్వానం

- ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ప్రారంభం
- మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక
- పిల్లల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణలు



ఆకర్షణీయంగా రేపు దిద్దుకున్న ఏపీ మోడల్ స్కూల్

ఓర్వకల్లు: గ్రామీణ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే దిశగా ఏపీ ఆదర్శ పాఠశాల ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆదర్శ కళాశాలలను కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతిభా వంతులైన నిరుపేద విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తున్న ఓర్వకల్లు ఆదర్శ పాఠశాల నిరుపేద పిల్లల భవితకు చక్కని అవకాశం కల్పిస్తోంది. ప్రైవేట్ విద్యా సంస్థల్లో వేలకు వేలు ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాల పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా అత్యాధునిక సదుపాయాలతో పాఠశాల రూపురేఖలు మార్చేసింది.

పాఠశాల ప్రత్యేకతలు

ఓర్వకల్లులో నెలకొల్పిన ఏపీ మోడల్ స్కూల్ ఆవిర్భావం నుంచి ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య నాణ్యతతో కూడిన విద్యాబోధన, క్రమశిక్షణతో కూడిన నైపుణ్యాభివృద్ధికి విశేష కృషిచేస్తోంది. విశాలమైన తరగతి గదులు, ఆధునిక ల్యాబొరేటరీలు, అత్యాధునికమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయి.

- విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించే వృత్తి విద్యా కోర్సులతో పాటు, సృజనాత్మకతను పదను పెట్టే అటల్ టింక్లింగ్ ల్యాబొరేటరీ సదుపాయం ఉంది.
- క్రమశిక్షణ, ఐకమత్యాన్ని అవలంబించేందుకు ఎన్‌సీసీ యూనిట్లు, విద్యార్థి దశలోనే సేవా గుణం నాటుకుపోయే విధంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా మంత్రులు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసలు లభించడం గమనార్హం.

ప్రవేశాలకు దరఖాస్తులు

మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ/ఎంపీసీ/ఎంఈసీ/సీఈసీ గ్రూపులలో ప్రవేశం కోరు విద్యార్థులు తమ దరఖాస్తులను ఈ నెల 22 నుంచి జూన్ 7 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10 వ తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రవేశ రుసుం

కళాశాలలో చేరదలచిన ఓసీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 చొప్పున ప్రవేశరుసుం చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను 10వ తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగానే ఎంపిక చేయడం జరుగుతోంది.

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన

విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా సరళమైన పద్ధతిలో బోధించి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నాం. ఉపాధ్యాయుల సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వంగా ఉంది. గత ఏడాది 25 శాతం అడ్మిషన్లు పెరగడం అందుకు నిదర్శనం.
– జోషిల వాట్, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, ఓర్వకల్లు

క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని చెంచుకాలనీలో వెలసిన సుంకులాపరమేశ్వరి ఆలయంలో బుధవారం హుండీలోని కానుకలను లెక్కించారు. గత 27 నెలలుగా హుండీలో భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.4.25 లక్షల నగదుతో పాటు వెండి ఆభరణాలు సమకూరినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు: పట్టణంలోని పులకుర్తి రహదారి వైపు వేదాంతపురి కాలనీలో వేంకటేశ్వర స్వామి, ధర్మ శాస్త అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పూజల్లో భాగంగా బుధవారం భక్తిశ్రద్ధలతో యజ్ఞం నిర్వహించారు. పండితులు ముందుగా లక్ష్మీగణపతి హోమార్చన, గోపూజ తదితరు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ అభివృద్ధికి, ప్రజల ఆయురారోగ్య, ఐశ్వర్యప్రాప్తి కోసం యజ్ఞం న్విహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

సి.బెళగల్: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు (డీడీ) శ్యామల సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. బుధవారం ఆమె తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఎంపీడీఓ రాముడలతో కలిసి మండల కేంద్రంలోని ఒకటో సచివాలయాన్ని, ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఉద్యోగుల మూమెంట్ రిజిస్టర్ ఎనిమిది నెలలుగా అసంపూర్తిగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు ఆలస్యంగా వస్తుండటాన్ని గమనించి.. ఇలా జరిగితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆధార్ నమోదు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పాఠశాలల విద్యార్థుల వివరాల నమోదుకు ప్రధాన్యాత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అలాగే సచివాలయంలో టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేసి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, ఈఓఆర్డీ సందీప్, వైకేపీఏం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

వృద్ధాప్యం మరో పసితనం లాంటిది



వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ బి. శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): వృద్ధాప్యం మరో పసితనం లాంటిదని, వారి బాగోగులు చూడాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. బుధవారం ఆయన కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యాసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయుల కోసం ఎంతగానో ఎదురుచూసే మనసు వృద్ధులకు ఉంటుందన్నారు. ప్రేమ, ఆప్యాయతలు దూరం కావడం, గృహ సంబంధమైన వివాదాలు, ఉద్యోగాల పేరిట పిల్లలు దూరంగా ఉండటం వంటి కారణాల వల్ల వృద్ధులు ఆశ్రమాల్లో ఉండాల్సి వస్తోందన్నారు. జీవిత అనుభవం తెలుసుకోవాలంటే నేటి యువతరం వృద్ధులతో గడపాలన్నారు.

జైన్ ఆలయం సందర్శించిన ఐఏఎస్ ర్యాంకర్



జైన్ ఆలయంలో అంబికా జైన్

కర్నూలు(సెంట్రల్): ఐఏఎస్‌కు ఎంపికైన ఎమ్మిగనూరు చెందిన జైన్ ఎలక్ట్రానిక్స్ యజమాని లలిత్‌జైన్ కుమార్తె అంబికా జైన్ బుధవారం కర్నూలులోని జైన్ అలయాన్ని సందర్శించింది. హైదరాబాద్ రూట్‌లో ఉన్న ఆలయాన్ని ఆమె సందర్శించి మొక్కులు తీర్చుకుంది. మారుమూల ప్రాంతమైన ఎమ్మిగనూరుకు చెందిన ఆమె ఐఏఎస్ ర్యాంకు సాధించడంతో పలువురు అభినందించారు.

గ్రామ కంఠం రీ సర్వేను వేగవంతం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కర్నూలు(అర్బన్): గ్రామాల్లోని నివాసాలు, ప్రభుత్వ భవనాలు, గ్రామ కంఠం స్థలాలకు రక్షణ కల్పించేందుకు నిర్వహిస్తున్న రీ సర్వేను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ సూర్యకుమారి ఆదేశించారు. బుధవారం ఆమె విజయవాడలోని తమ కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజునాయుడు, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామకంఠం రీసర్వేకు సంబంధించిన కార్యక్రమాల్లో ఎంపీడీఓలు కూడా పాల్గొనేలా సీఈఓలు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూడా సీఈఓలు తమ పాత్ర పోషించాలన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు, నాణ్యత, జాబ్ కార్డ్స్ మంజూరు, కూలీల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ సంసద్ యోజన కార్యక్రమాన్ని అమలు చేయడంలో భాగంగా జిల్లా కలెక్టర్ ద్వారా స్థానిక పార్లమెంటు సభ్యులతో కలసి సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే కోర్టు కేసులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కర్నూలు(హాస్పిటల్): హజ్‌కు వెళ్లే యాత్రికులకు అవసరమైన వ్యాక్సినేషన్లు వేసేందుకు బుధవారం పెద్దమార్కెట్ వద్ద ఉన్న రాయల్ ఫంక్షన్ హాలులో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. హజ్‌కు వెళ్లేందుకు 280 మంది నమోదు చేసుకున్నారని, వీరందరికీ ఓరల్ పోలియో వ్యాక్సిన్, మేనిన్గోకోకల్, ఇన్‌ఫ్లూయింజా వ్యాక్సిన్‌లు వేశారన్నారు. వీరికి అవసరమైన టీకాలు వేసి సర్టిఫికెట్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డాక్టర్ హకీమ్, డాక్టర్ మాధవి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ మౌనిక, డాక్టర్ శహిస్తఫాతిమా, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ మున్వర్, డాక్టర్ మొయిన్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



హజ్ యాత్రికునికి వ్యాక్సిన్ చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ప్రతి ఒక్కరూ తమ చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలుష్య నియంత్ర మండలి డిప్యూటీ జోనల్ మేనేజర్ కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. బుధవారం మిషన్ లైఫ్ కార్యక్రమంలో కల్లూరు పారిశ్రామిక వాడలో పీసీబీ, మునిసిపల్, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలన్నారు. కాలంచెల్లిన వాహనాలను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ మునిప్రసాదు పాల్గొన్నారు.

నాట్ విల్లింగ్ సరికాదు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల పదోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహించకుండా నాట్ విల్లింగ్ ఇవ్వమని కోరడం సరైంది కాదని, పదోన్నతులు, బదిలీలలో అసంబద్ధమైన వాటిని తొలగించాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓ రంగారెడ్డిని కోరారు. బుధవారం వారు డీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ పదోన్నతి వస్తుందో రాదో తెలియని ఉపాధ్యాయులు ముందుగానే నాట్ విల్లింగ్ ఇవ్వడం ద్వారా చేజేతులా తన పదోన్నతిని తానే కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పదోన్నతులు ప్రత్యక్ష కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య తదితరులు ఉన్నారు.

రెండు ఇళ్లలో చోరీకి యత్నం

ఎమ్మిగనూరురూరల్: మునెప్పనగర్‌లో ఊళ్లకు వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయుల ఇళ్లల్లో దొంగలు చోరీకి యత్నించిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మునెప్ప నగర్, రాధాకృష్ణ కాలనీ శివారులో ఉపాధ్యాయులు ప్రసాద్, బావిగడ్డ నల్లారెడ్డిలు నివాసముంటున్నారు. వేసవి సెలవులు కావడంతో ఇళ్లకు తాళం వేసి తమ ఊళ్లకు వెళ్లిపోయారు. గమనించిన దొంగలు మంగళవారం అర్ధరాత్రి రెండు ఇళ్ల తాళాలు పగటగొట్టి లోపలికి చొరబడి బీరువాలు తెరిచి డబ్బు, నగలు ఉన్నాయేమోనని వెతికారు. ఏమీ దొరక్కపోవటంతో చీరలు, వస్తువులు చెల్లాచెదారుగా పడేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం ఇంటి పక్కల వాళ్లు గమనించి విషయాన్ని జయమానులకు చేరవేశారు. వారు ఇంటికి చేరుకొని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ మధుసుదన్‌రావు చెప్పారు.

అక్రమ మద్యం విక్రయాలపై దాడులు

వెల్దుర్తి: మండలంలోని రామళ్లకోట, చెర్లకొత్తూరు గ్రామంలో కర్ణాటక టెట్రాప్యాకెట్ల మద్యాన్ని తెచ్చి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు కోడుమూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్, స్థానిక ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండ్రోజులుగా దాడులు నిర్వహించారు. దాడుల్లో రామళ్లకోటకు చెందిన ఈడిగ షేక్షావలి గౌడ్ వద్ద నుంచి 27, చెర్లకొత్తూరుకు చెందిన దొండల్ల తిరుమలేశ్ వద్ద నుంచి 480 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం ఎస్‌ఐలు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి డోన్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో వలసలను నివారించేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద చేపడుతున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పంట కాల్వల్లో జరుగుతున్న పూడికతీత పనులను ఏపీఓ రమాదేవితో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలన్నింటిలో ఉపాధి పనులను నిర్వహించడం జరుగుతుందని, జాబ్‌కార్డు ఉన్న కూలీలందరు పనుల్లోకి రావాలన్నారు. మండుతున్న ఎండల దృష్ట్యా కూలీలంతా ఉదయాన్నే పనుల్లోకి రావాలని, నిర్ణయించిన కొలతల మేర పనులు చేస్తే రూ.272 వేతనం పడుతుందన్నారు. పనుల్లోకి వచ్చిన సమయంలో కూలీలంతా తప్పని సరిగా హాజరు వేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉపాధి పనుల్లోకి వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని, రోజుకు సగటున 6 వేల మంది కూలీలు పనుల్లోకి వచ్చేలా చూడాలని ఏపీఓకు ఎంపీడీఓ సూచించారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

స్పోర్ట్స్

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో కర్నూలుకు పతకాలు



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

కర్నూలు (రూరల్): ఈనెల 21 నుంచి 25 వరకు గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలో జిల్లా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు పతకాలు సాధించారు. వీరిని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ బుధవారం అభినందించారు. సబ్ జూనియర్ విభాగంలో శివాజి (57 కేజీలు, మూడవ స్థానం), మహేంద్ర (56 కేజీలు, మూడవ స్థానం), విజయ్ కుమార్ (74 కేజీలు, మొదటి స్థానం), రాజు (83 కేజీలు, మొదటి స్థానం), రోహిత్ శర్మ (93 కేజీలు, రెండవ స్థానం), అలాగే జూనియర్స్ విభాగంలో లక్ష్మీనరసింహ (53 కేజీలు, మొదటి స్థానం), మహేశ్వరరావు (83 కేజీలు, రెండవ స్థానం), జూనియర్ బాలికల విభాగంలో పల్లవి (43 కేజీలు, మొదటి స్థానం) పతకాలు సాధించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం జిల్లాకు గర్వకారణమని అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, సీనియర్ క్రీడాకారిణి రేష్మ పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాకారులను అభినందిస్తున్న దాత వెంకటరామిరెడ్డి

కర్నూలు (రూరల్): వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న 40 మంది క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం నగరంలోని బి.క్యాంప్ క్రీడా మైదానంలో దాత సీనియర్ క్రీడాకారుడు వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఒలింపిక్ సీఈఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు నిత్య సాధన ద్వారా నైపుణ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్దపాడు స్కూల్ హెచ్‌ఎం వేణుగోపాల్, రంగడు, సీనియర్ క్రీడాకారులు విజయ్, రాజేశ్వర్, నరసింహులు, కుమార్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

గడివేముల: మండలంలో జగనన్న కాలనీలలో జరుగుతు గృహనిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఈఈ మాధవరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకుంటున్న ప్రతి ఒక్కరికీ బిల్లులు సకాలంలో అందిస్తామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

‘కేవీ సుబ్బారెడ్డి’లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

కల్లూరు: దూపాడు సమీపంలోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఎంబీఏ కళాశాలలో ఈనెల 26న హెటిరో ల్యాబ్స్ వారిచే క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కె.విశ్వమోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ‘వలంటీర్లకు వందనం’

కల్లూరు: మండలంలోని ఉలిందకొండ, కొంగనపాడు, నాయకల్లు, తడకనపల్లె, చిన్నటేకూరు, పెద్దటేకూరు,బస్తిపాడు, బొల్లవరం, పుసులూరు గ్రామ సచివాలయ పరిధిలో అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు గురువారం ఉలిందకొండలో సన్మాన కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై వలంటీర్లను సన్మానించనున్నారన్నారు.

కౌలు రైతుల సంక్షేమానికి కృషి

గడివేముల: కౌలు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం దర్వేశి, కొరటమద్ది, గడిగరేవుల గ్రామాల ఆర్బీకేల్లో కౌలు రైతు కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ హేమసుందర్‌రెడ్డి మాట్లాడుతూ భూయజమాని హక్కులకు ఇబ్బంది కలగకుండా కౌలు రైతులకు సాగుదారు పత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. తద్వారా కౌలు రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చన్నారు. వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ యోజన, సున్నా వడ్డీ, వైఎస్సార్ పంటల బీమా వంటి పథకాలను పొందవచ్చన్నారు. రైతుభరోసా కేంద్రంలో అందించే సబ్సిడీ విత్తనాలను, ఎరువులను తీసుకోవచ్చన్నారు. కౌలు రైతులు ప్రతి ఒక్కరూ స్థానిక ఆర్బీకేల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. అనంతరం చిరుధాన్యాల సాగుతో కలిగే లాభాల గురించి అన్నదాతలకు వివరించారు.



దుర్వేశిలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

పుస్తక పఠనాన్ని అలవర్చుకోండి

కర్నూలు(సెంట్రల్) : విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని రిటైర్డ్ లెక్చరర్ హుస్సేన్ పీరా సూచించారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరానికి ఆయన అతిథిగా హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పుస్తక పఠనం ప్రాధాన్యతను వివరించారు. పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి పెరుగుతుందని, మనసు నిబ్బరంగా ఉంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు సామెతలు, కవితలు, హాస్యాలను బోధించారు. కార్యక్రమంలో అటవీ శాఖకు చెందిన రేణుక, అబ్దుల్‌కలాం, కాశీదాసు, లక్ష్మీదేవిబాయి, జనవిజ్ఞాన వేదిక సభ్యులు యాగంటీశ్వరప్ప పాల్గొన్నారు.



విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలను సాగును ప్రోత్సహించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పూడిచెర్ల గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పూడిచెర్ల, ఓర్వకల్లు గామాల వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ఉపాధి హామీ సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాల మేరకు కూలీలకు పనులను కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధుకృష్ణ, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.



పండ్ల తోటలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

కృష్ణగిరి: గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ ఉమామహేశ్వరమ్మ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం గ్రామైక్య సంఘం సభ్యులు, వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులకు బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామ, మండలస్థాయిలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీలోని సభ్యులందరూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ పురుషోత్తం, ఏపీఎం మహేశ్వరయ్య, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు సరోజతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ పీడీ ఉమామహేశ్వరి

ట్రాఫిక్ .. పరేషాన్

- పట్టించుకోని పోలీసులు
- రహదారుల వెడల్పుపై దృష్టి సారించని అధికారులు

గూడూరు: పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది. మేజర్ పంచాయతీగా ఉన్న గూడూరు 10 ఏళ్ల క్రితం నగర పంచాయతీగా మార్పు చెందింది. పట్టణంలో దాదాపు 50 వేల జనాభా ఉంది. మండల కేంద్రం కావడం, అటు కోడుమూరు, ఇటు ఎమ్మిగనూరు, కర్నూలు, సుంకేసుల మీదుగా నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కాగా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించే వ్యవస్థ లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజ వీధి, రైస్ మిల్లు ప్రాంతాల్లో వాహనాలు ఎదురెదురుగా వస్తే గంటల కొద్దీ ఎక్కడివాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. ఇలాంటి క్రమంలో వాహనాదారులు ఘర్షణలకు దిగుతున్నారు. తప్పు నీది అంటే.. కాదు నీది అంటూ వాహనాలను రోడ్లపైనే నిలిపేసి గొడవలకు దిగుతూ చివరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఘటనలూ కోకొల్లలు.

రహదారిపైనే వాహనాలు

దుకాణాల ఎదుట వాహనాలు నిలుపు కోవడానికి సరైన స్థలం లేకపోవడంతో రహదారిపైనే కొందరు తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మున్సిపల్, పోలీసు అధికారులు వాహనాల పార్కింగ్ కోసం ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రహదారుల విస్తరణ అవసరం

పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తగ్గడానికి రహదారుల వెడల్పు ఎంతో అవసరమని ప్రజలు భావిస్తున్నారు. ఊరు పుట్టినప్పుడు ఏర్పాటు చేసిన రహదారులపైనే ప్రస్తుతం వాహనాలు తిరుగుతున్నాయి. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని రహదారులను వెడల్పు చేయాల్సిన అవసరం ఏర్పడినప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



గూడూరు–ఎమ్మిగనూరు రహదారిలో వాహనాల రద్దీ

కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

పట్టణంలో రహదారుల విస్తరణ జరగాలి. ప్రజల సహకారం అవసరం. కౌన్సిల్‌లో కూడా ఈ విషయంపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటాం.
– జులుపాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్, గూడూరు